దంచికొట్టిన వాన

- చెరువులను తలపిస్తున్న రహదారులు..!!
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- రోడ్లపై నిలిచిన వాహనాలు.. భారీగా ట్రాఫిక్ జాం
- సహాయక చర్యల్లో డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బంది

మీర్‌పేట మిథిలానగర్‌లో నీట మునిగిన కాలనీలు

మన్సూరాబాద్ డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల సమీపంలో వర్షపునీరులో నిలిచిన వాహనాన్ని తోసుకుంటూ రోడ్డుపైకి తీసుకువస్తున్న దృశ్యం

వరదనీటిలో ద్విచక్రవాహనాలు ఆగిపోవటంతో వాహనదారుల ఇక్కట్లు

చింతలకుంట జాతీయ రహదారిపై సహాయక చర్యలు చేపడుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

అయ్యప్పకాలనీలోని ఓ ఇంట్లోకి వర్షపునీరు చేరిన దృశ్యం

హయత్‌నగర్, ఆగస్టు 20: నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్లన్నీ వరద ముంపునకు గురయ్యాయి. దీంతో స్థానికులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. ఉదయం డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి మ్యాన్‌హోల్స్ తెరవడంతో వరదనీరు వెళ్లిపోయింది. విరిగిపడిన చెట్లను, విద్యుత్‌స్తంభాన్ని తొలగించారు. హయత్‌నగర్ డివిజన్లోని హైకోర్టు కాలనీలో ప్రధాన రోడ్డు వరదనీటితో నిండిపోయింది. కమలానగర్‌లో చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఉదయం నుంచి డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి వాటిని తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరో నాలుగు రోజులపాటు వర్షాలు కొనసాగుతాయని, వాతావరణశాఖ సమాచారం ఇవ్వడంతో కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంట్లో నుంచి బయటికి రాకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ, వరదనీటి మ్యాన్‌హోల్స్ ఉన్నచోట్ల ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డీఆర్ఎఫ్ కంట్రోల్ రూమ్ సెల్ నం.90001 13667, ఏఈ చంద్రశేఖర్ సెల్.73373 64225, వర్క్ ఇన్‌స్పెక్టర్ 99899 77533, కరెంట్ ఆఫీసు సెల్.94901 53577, భాగ్యలత సెక్షన్ సెల్.94901 53588, సివరేజ్ సూపర్‌వైజర్ సెల్.79894 63445లో సంప్రదించాలని కోరారు. సహాయక చర్యల్లో డీఈ దామోదర్ రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, సిబ్బంది ఉన్నారు.

అయ్యప్పకాలనీ జలమయం..

మన్సూరాబాద్: మంగళవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షంతో నాగోల్ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతమైన అయ్యప్పకాలనీలోకి భారీగా వర్షం నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 4:30 గంటల నుంచి 7 గంటల వరకు కురిసిన వర్షం వలన ఎగువ కాలనీల నుంచి వచ్చిన వరదనీటితో అయ్యప్పకాలనీలోని రోడ్లు జలమయమయ్యాయి. రెండు, మూడు ఇండ్లలోకి కొద్ది పాటి నీరు చేరింది. అదేవిధంగా మన్సూరాబాద్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాల నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తాకు వెళ్లే మార్గం, బండ్లగూడ చౌరస్తా సమీపంలో వర్షపు నీరు చేరడంతో ఉదయాన్నే ఉద్యోగాలకు వెళ్లే ప్రజలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. విషయాన్ని తెలుసుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది అయ్యప్పకాలనీతో పాటు బండ్లగూడ చౌరస్తా, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సముదాయాల నుంచి ఆనంద్‌నగర్‌కు వెళ్లే మార్గంలో సహాయక చర్యలు చేపట్టి ప్రజా జీవనానికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు.

లోతట్టు ప్రాంతాలు అతలాకుతలం..

ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గంలో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని చింతలకుంట, హయత్‌నగర్ మహాలక్ష్మి నగర్ ప్రాంతాలు వరదనీరుతో నిండిపోగా అధికారులు వెంటనే స్పందించి ప్రహరీగోడను కొట్టిసి నీటిని తొలగించారు. వరదనీటి ఉధృతికి గుంటి జంగయ్య కాలనీ, సాగర్ రోడ్డులో జంక్షన్ ప్రాంతంలో, సామ నర్సింహారెడ్డి గార్డెన్స్ వద్ద ప్రధాన రహదారిపై, వెంకటరమణా కాలనీ నుంచి తిరుమల్ ఆస్పత్రి వద్ద రోడ్డు క్రాస్ చేసి ప్రవాహం ముందుకు కాలనీలకు పోటెత్తింది. ఇక్కడ రూ.12.94కోట్లతో ఎస్ఎన్‌డీపీ మంజూరు అయ్యింది. అయితే ఈ పనులు పెండింగ్‌లో ఉండటంతో తాజాగా వరదనీరు ఉధృతికి ఎపీ ఎస్ఈబీ కాలనీ, పిండినారాయణరెడ్డి, రెడ్డి కాలనీ, సాగర్ ఎన్‌క్లేవ్ ప్రాంతాలు.. సామ నర్సింహారెడ్డి గార్డెన్స్ వద్ద ప్రధాన రహదారిపై వాహనాలకు.. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని కాలనీలు కూడా వరదనీటికి ఇబ్బందిగా మారాయి.

ఆజంపురా బ్రిడ్జిపైనుంచి ప్రవహిస్తున్న వరద

మూసారాంబాగ్ బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తున్న మూసీ

కమలానగర్‌లో విరిగిన చెట్టును తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

బండ్లగూడ, అయ్యప్పకాలనీలోకి వరదనీరు చేరిన దృశ్యం

భారీగా ట్రాఫిక్ జాం..

సైదాబాద్: సైదాబాద్, అక్బర్‌బాగ్, మూసారాంబాగ్, పాత మలక్‌పేట డివిజన్లలోని పలు ప్రాంతాలు వరదనీటితో మునిచెత్తాయి. మలక్‌పేట యశోద దవాఖాన, ప్రిన్స్ గ్రౌండ్, రిలయన్స్ మాల్, ఎంసీహెచ్ కాలనీ, పాత మలక్‌పేట, పల్టన్, అక్బర్‌బాగ్ అక్షయ్ టిఫిన్ సెంటర్, ఖాదీ బండారు, శంకేశ్వర బజార్, సింగరేణికాలనీ, కృష్ణానగర్, సాయిరాం కాలనీ, సన్‌సైన్ కాలనీ తదితర ప్రాంతాలు వరదనీటితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. తెల్లవారుజామున మొదలైన వర్షం విరామం లేకుండా తొమ్మిది గంటల వరకు కురిసిన వర్షంతో రోడ్లపై వరదనీరు నిలిచిపోయింది. రోడ్లపై నిలిచిపోయిన వరదనీటిని తొలగించటానికి డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బంది పలు చర్యలు చేపట్టారు. మలక్‌పేట రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి కింద భారీగా వర్షపు నీరు చేరటంతో మలక్‌పేట-దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై నిలిచి పోయిన వాహనాలను తొలగించటానికి మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు పలు చర్యలు తీసుకున్నారు. అదే విధంగా మలక్‌పేట అక్షయ్ టిఫిన్ సెంటర్, మెట్రో స్టేషన్ వద్ద వరదనీరు పోయేందుకు ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది తగు చర్యలు తీసుకుని, రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలను ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

జలాశయాలను తలపించిన రహదారులు..

మలక్‌పేట: మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి మలక్‌పేట ప్రాంతంలో రహదారులు జలాశయాలను తలపించాయి. రహదారులపై మోకాలిలోతు నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వరదనీటిలో ద్విచక్రవాహనాలు ఆగిపోవటంతో తోసుకుంటూ బయటికి వెళ్లారు. మలక్‌పేట రైల్వే బ్రిడ్జికింద భారీగా వరదనీరు చేరటంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. దాంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. వెంటనే అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు వరదనీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మలక్‌పేట గంజ్(న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్) వద్ద వరదనీరు జాతీయ రహదారిపై నుంచి వేగంగా ప్రవహించటంతో వాహనాలు కోట్టుకుపోవటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. డీఆర్ఎఫ్, బృందాలు, మలక్‌పేట ట్రాఫిక్ మ్యాన్‌హోళ్ల మూతలు తెరిచి వరదనీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవటంతో వాహనాల రాకపోకలు సాఫీగా కొనసాగాయి. అదేవిధంగా మూసారాంబాగ్ మెట్రోస్టేషన్ వద్ద జాతీయ రహదారిపై భారీగా వరదనీరు చేరటంతో మలక్‌పేట పోలీసులు మ్యాన్‌హోళ్ల మూతలు తెరవటంతో కొద్ది సేపట్లోనే వరదనీరు వెళ్లిపోయింది. పాత మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్, పద్మానగర్ కాలనీలోకి కూడా వరదనీరు చేరగా జీహెచ్ఎంసీ సిబ్బంది క్లియర్ చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి నీటిని విడుదల చేయటంతో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను పోలీసులు అప్రమత్తం చేశారు. వరదకాలువల్లో వరద ప్రవాహం పెరగటంతో ఆజంపురా బ్రిడ్జిపైనుంచి ప్రవాహం కొనసాగగా, మూసారాంబాగ్ బ్రిడ్జిని తాకుతూ మూసీ ప్రవహిస్తుంది.

నీట మునిగిన మిథిలానగర్ కాలనీ..

బడంగ్‌పేట: భారీ వర్షాలతో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీలు జలమయంగా మారాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మిథిలానగర్, సత్యసాయి నగర్ తదితర కాలనీలో జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇండ్లలో ఉన్న నిత్యావసర సరుకులు, వస్తువులు తడిసి ముద్దయ్యాయి. ఇండ్ల చుట్టూ వరద చేరడంతో ప్రజలు రాత్రంతా బిక్కు బిక్కుమంటూ గడిపామని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ నిధులతో నాలాల పనులు చేపట్టారు. ఎస్ఎన్‌డీపీ పనులు చివరి దశకు వచ్చాయి. పనులు పూర్తి కావడానికి గత ప్రభుత్వం మరో రూ.50 కోట్లు కేటాయించింది. ఆ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలోనే నిలిపేసింది. దీంతో ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేయకపోవడం వల్లనే మీర్‌పేటలోని పలు కాలనీలు ముంపునకు గురికావడం జరిగిందని కార్పొరేటర్ సురేఖారమేశ్ ఆరోపించారు. ముంపు సమస్య పరిష్కారం కావాలంటే ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిన రూ.50 కోట్లు తిరిగి కేటాయించాలన్నారు. లేనిపక్షంలో మిథిలానగర్, సత్యసాయి నగర్, కమలానగర్ తదితర కాలనీలన్నీ ముంపుబారిన పడక తప్పదని తెలిపారు.

మలక్‌పేట రైల్వే బ్రిడ్జికింద వరదనీటిలో ప్రయణాలు సాగిస్తున్న వాహనాలు

నేలకొరిగిన చెట్టు..

ఆర్కేపురం: ఆర్కేపురం డివిజన్ మార్గదర్శి కాలనీలో భారీ వర్షం, తీవ్రమైన గాలికి భారీ వృక్షం నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఆటో ఉండటంతో ఆటో నుజ్జునుజ్జయింది. అది గమనించిన రంగారెడ్డి జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అధికారులు స్పందించి చెట్టును తొలగించారు.

మార్గదర్శి కాలనీలో నేలకొరిగిన భారీ వృక్షం

అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎంకాం (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ అన్ని కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ.300 అపరాధ రుసుంతో 27లోగా చెల్లించవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఏఎస్ఎల్‌పీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును 27 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుంతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంబీఏ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్) సెమిస్టర్ల రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఈ కోర్సుల మేకప్ పరీక్షా తేదీల మార్పు

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల మేకప్ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్), బీఈ (ఏఐసీటీఈ), బీఈ (నాన్ సీబీసీఎస్) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ముగిసిన పౌరాణిక పద్యనాటక పోటీలు

శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక పద్యనాటికలో ఓ సన్నివేశం

వనస్థలిపురం, ఆగస్టు 20: రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న పౌరాణిక పద్యనాటక పోటీలు ముగిశాయి. ముగింపు సందర్భంగా కళాకారులు శ్రీకృష్ణ తులాభారం పద్య నాటికను ప్రదర్శించారు. తమ అభినయంతో కళాకారులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. పౌరాణిక రంగస్థలం ఎంతో గొప్ప కళ అన్నారు. మన పూర్వీకులు మనకు ఇచ్చిన ఆ కళను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వనస్థలిపురంలో కొన్నేళ్లుగా కళాకారులను అండదండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంపన వెంకటేశ్వరరావు, టి.రామచంద్రరావు, కార్పొరేటర్ లచ్చిరెడ్డి, పీవీవీ సత్యనారాయణ, సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు అందరూ సహకరించాలి

ప్రపంచ దోమల నివారణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 20: రోగాలను వ్యాప్తి చేసే దోమల నివారణకు అందరూ కృషి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని మంగళవారం బీఎన్ రెడ్డినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నివారణపై అవగాహన కల్పించారు. చెత్త సేకరణలో సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను పారవేయవద్దన్నారు. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అపరిశుభ్రత వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. తద్వారా ప్రాణాంతకమైన వ్యాధులు ప్రభలుతాయన్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమలానగర్‌లో డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 20: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్‌లోని ముంపునకు గురైన కాలనీలను కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, స్థానికులు, డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల సమయంలో చెట్లకు ఆనుకోని విద్యుత్ స్తంభాలు ఉన్నట్లో దూరంగా ఉండాలని సూచించారు. ముంపునకు గురైన కాలనీల్లో, చెట్లు కూలిన చోట్ల డీఆర్ఎఫ్ సిబ్బందితో తక్షణమే సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. మరో నాలుగు రోజులు వర్షాలు ఉన్నందున కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయన వెంట కాలనీవాసులు టీవీ రావు, సుబ్బారావు, మల్లికార్జున్, దివాకర్, గణేశ్, భగత్‌సింగ్, మదన్‌రెడ్డి, కిష్టారావు, తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

చంపాపేట, ఆగస్టు 20: కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకారం అభినందనీయమని ఆలయ పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. ఆలయ ప్రాంగణంలోని నవగ్రహాల మండపం ముందు నుంచి దుర్గమాత ఆలయం వరకు సుమారు రూ.6.5లక్షలతో నిర్మించనున్న రేకుల షెడ్డు నిర్మాణ పనులను ఆలయ ధర్మకర్తలతో కలిసి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి ఆలయ ధర్మకర్త బిల్లకంటి కిరణ్‌కుమార్ గుప్తా సహకారంతో మంచుకొండ రామ్మూర్తి పద్మజ దంపతులతో పాటు వారి కుమార్తే లాస్య సుమారు రూ.20వేల వ్యయంతో సమకూర్చిన పల్లకీ సేవా గొడుగును పాలకమండలికి సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌గౌడ్ బిల్ల కంటి కిరణ్‌కుమార్ గుప్తా, గోగిరెడ్డి అంజిరెడ్డి, చాతిరి మధుసాగర్, గూడూరు మధుసూదన్‌రెడ్డి, బీసుకుంట్ల సతీశ్‌గౌడ్, చేగోని సురేశ్‌గౌడ్, మేకల యాదగిరి, నాయకులు గూడూరు గౌతంరెడ్డి, కొండ యాదగిరి పాల్గొన్నారు.



రేకుల షెడ్డు పనులు ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

న్యాయవాదులపై దాడులు.. కఠిన చర్యలు తీసుకోవాలి

ఆర్కేపురం, ఆగస్టు 20: కూకట్‌పల్లిలో న్యాయవాదిపై పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి కోర్టు ముందు న్యాయవాదులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది జిల్లా రమణరావు మాట్లాడుతూ.. న్యాయవాదులపై పోలీసులు జరుపుతున్న వరుస దాడులు హేయమైన చర్య అన్నారు. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యుడు న్యాయవాది సంతోష్‌పై దాడి చేసిన బోరబండ పోలీసులపై కఠిన చర్యలు తీసుకొని వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపై దాడిచేసే వారిని హింసించడం చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. న్యాయవాది సంతోష్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ, సీపీకి కంప్లెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, కృష్ణ, సదానంద్, మీనాక్షి, అర్చన, రాములు, దీప్తి, రవి తదితరులు ఉన్నారు.



కోర్టు విధులు బహిష్కరించి.. కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఎల్లమ్మ తల్లి కల్యాణంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్, ఆగస్టు 20: తుక్కగూడ మున్సిపాలిటీ పరిధిలోని కొంగర రావిరాల సూరంగుట్ట సూర్యగిరి ఎల్లమ్మ తల్లి బోనాలు, కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్య స్వామి 11వ వార్షికోత్సవాలు

సుబ్రహ్మణ్య స్వామి పదకొండవ వార్షిక ప్రతిష్టాపక ఉత్సవాలను పురస్కరించుకుని మల్లికార్జుననగర్ నార్త్ కాలనీలోని దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన దృశ్యం

మన్సూరాబాద్, ఆగస్టు 20: మన్సూరాబాద్ డివిజన్ పరిధి మల్లికార్జుననగర్ నార్త్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామి 11వ వార్షిక ప్రతిష్ఠాపక ఉత్సవాలు బుధ, గురువారాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

వివాహిత ఆత్మహత్య

కందుకూరు, ఆగస్టు 20: మాదాపూర్‌లో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కందుకూరు పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాస్, సువర్ణ (33) దంపతులు. పెండ్లి అయిన కొద్ది రోజుల నుంచే సువర్ణకు అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. భర్త శ్రీనివాస్ ఆమెను ప్రతి రోజూ చిత్రహింసలు పెడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందడంలో ఆమె ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన సోదరి మృతికి కాణమైన ఆమె భర్త, అత్తామామలు, మరిదిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ సువర్ణ సోదరుడు కృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కందుకూరు పోలీసులు శవపంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కందుకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎనలేని కృషి

మన్సూరాబాద్, ఆగస్టు 20: దేశంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించిన ఘనత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీకి దక్కుతుందని తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎన్సీ సెల్ చైర్మన్ జోగు రాములు ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రావుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు సుజాతరెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్, అజయ్, రవి, అరుణ్, అశోక్‌రెడ్డి, గాంధీనాయక్, యూసుఫ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో..

ఆర్కేపురం: ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌యాదవ్, రాజునాయక్, పెద్దపూర సైదులు, కిరణ్‌కుమార్, శేఖర్, లింగస్వామిగౌడ్, అక్బర్, మహేందర్, కళ్యాణ్‌యాదవ్, సలీమ్, హరి, అల్లావుద్దీన్‌పటేల్, ఎల్లన్న, షఫీ, పరీద్ పాషా తదితరులు ఉన్నారు.

బైరమాల్‌గూడ చౌరస్తాలో..

చంపాపేట: బైరమాల్‌గూడ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తోకటి కిరణ్, శ్రీపాల్‌రెడ్డి, కొక్కొండ ప్రకాశ్‌గుప్తా, ఈపూరి బద్రీనాథ్, నాయకులు కారు కొండ శివ, గడ్డం వెంకటేశ్, గౌని అనుసూయ, బండారు శ్రీనివాస్‌రెడ్డి, రాముయాదవ్, వెంకట్‌రమణారెడ్డి, మెగావత్ గణేశ్‌నాయక్, లక్ష్మణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమ